కథ

# మహాప్రస్థానం

రావుల పుల్లాచారి
99492 08476

మహాప్రస్థానంలో సూపర్‌వైజర్‌గా పని చేస్తున్నాడు శివానందం. కొత్తగా రాబోతున్న శవాలను కాల్చడానికి ప్లాట్‌ఫాంలను సిబ్బందితో సిద్ధం చేయిస్తున్నాడు.

తన స్మార్ట్‌ఫోన్.. 'ఈ జీవన తరంగాలలో..' అంటూ రింగ్ కాగానే.. విసుగ్గా లిఫ్ట్ చేశాడు.

''నిన్న రాత్రి మా ఇంట్లో ఓ పెద్దావిడ చనిపోయింది. శవాన్ని ఏ సమయానికి తీసుకురమ్మంటారు? మా కోసం ఒక ప్లాట్‌ఫాంను సిద్ధంగా ఉంచండి. నా పేరు వెంకట్రావు. రిజిష్టర్‌లో నమోదు చేసుకోండి'' అంటూ చెప్పాడు అవతలి వ్యక్తి.

''సరే.. సరే! ఇప్పటికే రెండు శవాలు బుక్ అయి ఉన్నాయి. మీ దూరపు బంధువులు.. ఇంకా ఎవరైనా వచ్చేవరకు ఇంట్లోనే ఉంచుకొని, మధ్యాహ్నం వరకు తీసుకురండి'' చెప్పాడు శివానందం.

రోజూ ఐదారు శవాలు రావడం. వాటిని మహాప్రస్థానం ప్లాట్‌ఫాం మీదికి ఎక్కించి, సిబ్బంది చేత కాల్చడం.. నలభై – యాభైకి మధ్య వయసులో ఉన్న శివానందానికి ఈ పని అస్సలు నచ్చడం లేదు. ఏదో వైరాగ్యం ప్రవేశిస్తుంటుంది.

కానీ, తప్పదు! ఇదంతా తన వృత్తి నిర్వహణలో సహజమేనని, తన ప్రవృత్తికి సర్దిచెప్పుకొంటూ.. మరణంతో సహజీవనం చేయడం నేర్చుకున్నాడు.

* * *

టైం పన్నెండు దాటింది. త్వరగా ఇంటికి వెళ్లి లంచ్ చేసి వద్దామనుకొన్నాడు. కానీ, దూరం నుంచి మరో శవం వస్తున్నట్టుగా, డప్పు చప్పుళ్లు వినిపిస్తున్నాయి.

బహుశా ఇందాక ఫోన్ చేసిన వెంకట్రావు వాళ్లదే కావచ్చు అనుకున్నాడు.

'మధ్యాహ్నం రెండు గంటలవరకు తీసుకురమ్మన్నా కూడా.. ఆగకుండా తొందరపడి తెస్తున్నారు. చచ్చిపోయిన వారు తమకు ఎంతటి ఆప్తులు అయినా కూడా.. ఎప్పుడు తగలపెట్టేస్తామా? అని ఎదురుచూస్తూనే ఉంటారు. ఏమిటో ఈ మనుషులు!?' అనుకున్నాడు. కొందరైతే హాస్పిటల్‌లో అపస్మారకంలో ఉన్న తమ వారికోసం ముందుగానే మహాప్రస్థానానికి వచ్చి.. ఇక్కడి వసతులను, పరిసరాలను చూసి, దేనికి ఎంత ఖర్చు అవుతుందనే వివరాలు అడిగి.. డబ్బు లెక్క కట్టుకొని వెళ్తుంటారు.

ఈ ఆలోచన వచ్చిన వెంటనే శివానందం మనసులో కొద్దిరోజుల క్రితం వచ్చిన కృష్ణారావు మెదిలాడు. ఆయన మాత్రం అందరికన్నా భిన్నంగా కనిపించాడు. అతను వచ్చి మహాప్రస్థానం నిర్వహణ గురించి, ఇందులో పనిచేస్తున్న వ్యక్తుల సాధక బాధకాలతోపాటు, జీతభత్యాలు లాంటి విషయాల్ని, మరెన్నిటినో సానుభూతిగా అడిగి.. గొప్ప మనవతావాదిలా కనిపించాడు. తన తండ్రికి, తనకు మధ్య ఉన్న ప్రేమానురాగాల గురించి ఓ ఇంటి మనిషిలా చెప్పాడు. ఆయన చెబుతున్నపుడు శివానందం శ్రద్ధగా విన్నాడు. ఆయన చెప్పిన విధానం.. తరగతి గదిలో టీచర్ పాఠాలు బోధిస్తున్నట్లుగా అనిపించింది. ఆ పద్ధతి తనను ఆకర్షించింది.

అప్పుడే.. కృష్ణారావు నెంబర్‌ను ఫోన్‌లో సేవ్ చేసుకున్నాడు.

ఓ వారం రోజులకు కృష్ణారావు నుంచి ఫోన్ వచ్చింది.

''మా నాన్నగారు ఉదయం దివంగతులయ్యారు. శవాన్ని తీసుకువస్తున్నాం. ప్లాట్‌ఫాం రెడీ చేసి పెట్టండి!'' అంటూ ఫోన్ పెట్టేశాడు.

'పాపం! పెద్దాయన రాలిపోయారా!?' నిర్లిప్తంగా పెదవి విరిచాడు.

తరువాత కొన్ని రోజులకు కృష్ణారావుతో ఒకసారి మాట్లాడాడు. ఆయన కూడా ఆదరంగానే మాట్లాడాడు. ఒకసారి ఇంటికి రమ్మని పిలిచాడు కూడా.

'సార్ పిలవగానే వెళ్తే.. డబ్బులకు ఆశించో, ఏదైనా సహాయం అర్థించడానికో వచ్చాడని అనుకుంటాడేమో! మాట వరుసకు రమ్మనగానే వెళ్లడం మర్యాదగా ఉండదు!' అనుకొని వెళ్లలేదు.

అప్పటినుంచి మహాప్రస్థానానికి తండ్రి శవం తీసుకువచ్చిన ప్రతి కొడుకు

